



వరంగల్ నగర శివారులోని దేశాయిపేట వద్ద నిర్మించిన డబుల్ ఇళ్ల పైపుల దుస్థితి



వరంగల్ నగర శివారులోని దేశాయిపేట వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

'కల'గానే సొంతిళ్లు!

పంపిణీకి నోచుకోని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

- ఏళ్లతరబడి ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- ఉమ్మడి జిల్లాకు 25,994 ఇళ్లు మంజూరు
- నిర్మాణం పూర్తైనవి 11,049 మాత్రమే
- 5,728 ఇళ్లను పంపిణీ చేయకుండా తాత్సారం
- శిథిలమవుతున్న గోడలు, తలుపులు, కిటికీలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా గృహాలు
- వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారుల ఆందోళనలు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఆశలు గల్లంతయ్యాయి. కూడు లేకున్నా.. గూడు ఉంటే చాలని ఆశపడిన నిరుపేదలకు నిరాశే మిగులుతోంది. నిర్మాణం పూర్తై ఏళ్లు గడుస్తున్నా అయినా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పంపిణీకి నోచుకోవటం లేదు. దీంతో సొంతింటి కోసం ఎదురుచూస్తున్న పేదలకు నిరీక్షణ తప్పటం లేదు. డబుల్ ఇళ్లు ఇస్తామని మధ్య దళారులు పేదల నుంచి అందినంతా దండుకున్నారు. అయినా ఇళ్లు రాక.. ఇంటి కోసం ఇచ్చిన డబ్బులు తిరిగి రాక.. పేదల అరిగోస పడుతున్నారు. తమకు డబుల్ ఇళ్లు కేటాయించాలని ఆందోళనకు దిగుతున్నారు.

సొంతింటి కల

పేద ప్రజలకు సొంతింటి కలను నిజం చేసేందుకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇస్తామని బీఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఆవిర్భవించిన అధికారంలోకి వచ్చిన తర్వాత డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. 2014 నుంచి 2023 వరకు రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాకు 25,994 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేసింది. వీటిలో కేవలం 11,049 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తి చేశారు. సుమారు ఏడు వేలకు పైగా ఇళ్లు పునాదులు, పిల్లర్లు, రూఫ్ లెవల్ స్థాయిలోనే నిలిచిపోయాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవటంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే గృహ నిర్మాణ పనులను నిలిపివేశారు.

దళారుల వసూళ్లు

డబుల్ ఇళ్ల పేరుతో కొన్నిచోట్ల మధ్య దళారులు భారీగా వసూళ్లు చేసినట్లుగా ప్రచారం జరుగుతోంది. హనుమకొండ, వరంగల్, భూపాలపల్లి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు ఇప్పిస్తానని చెప్పి కొందరు గులాబీ నేతలు, దళారులు పేదల నుంచి ఇంటికి రూ.50వేల నుంచి రూ.5లక్ష వరకు వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. హనుమకొండలోని బాలసముద్రం ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు భారీగా డిమాండ్ ఉంది. నగరం నడిబొడ్డున ఈ ఇళ్లు ఉండటంతో చాలామంది దళారుల వీటిపైనే దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఇళ్లు ఇప్పిస్తామని రూ.3లక్షల నుంచి రూ.5లక్షల వరకు అనర్హుల నుంచి వసూళ్లు చేసినట్లుగా ఆరోపణలున్నాయి. జనగామ, భూపాలపల్లి, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలోనూ ఇలాంటి ఆరోపణలే ఉన్నాయి.

శిథిలావస్థలో..

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవటంతో అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. వరంగల్ జిల్లా దేశాయిపేటలో నిర్మించిన వాటిలో చాలావరకు ఇంటి తలుపులు, కిటికీలు పగిలిపోయాయి. స్లాబ్‌పై నుంచి సిమెంట్ బిచ్చలు రాలుతున్నాయి. హనుమకొండలోని బాలసముద్రంలోని డబుల్ ఇళ్ల పరిస్థితి కూడా శిథిలమై పనికి రాకుండా తయారవుతున్నాయి. ప్రస్తుతం వాటిని మరమ్మతులు చేయాలంటే ప్రతీ ఇంటికి తక్కువలో తక్కువగా రూ.50వేలకు పైగా ఖర్చు వస్తోందని అంచనా. ఖాళీగా ఉండటంవల్ల మరింత శిథిలావస్థకు చేరుకుంటాయని లబ్ధిదారులు అంటున్నారు.


ఆ సాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వినియోగంలో

మిగతా 6వ పేజీలో..

ఉమ్మడి జిల్లాలో డబుల్ బెడ్‌రూమ్‌ల పరిస్థితి ఇలా..

జిల్లా	మంజూరైన ఇళ్లు	పూర్తైన ఇళ్లే	పంపిణీ చేసినవి	పంపిణీ చేయనివి
వరంగల్	6,333	2,300	597	1,703
హనుమంకొండ	4,219	2,158	433	1,725
జనగామ	4,393	1,454	670	784
మహ-బాద్	5,567	2,503	1,403	1,100
భూపాలపల్లి	3,882	1,418	1,003	416
ములుగు	1,600	1,215	1,215	00
మొత్తం	25,994	11,049	5,321	5,728



మొక్కలతో నిండిపోయిన అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన ఇళ్లు



బొగత వద్ద మహిళాశక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మహిళలను కోటీశ్వరులు చేయటమే లక్ష్యం

- స్వావలంబన సాధించేలా పటిష్ఠ చర్యలు
- రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- బొగత వద్ద ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం



బొగత రైడర్ వాహనంలో సీతక్క

వాజేడు, జూలై 22: మహిళలను కోటీశ్వరులు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. వాజేడు మండలంలో ఆమె భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, కలెక్టర్ దివాకరతో కలిసి సోమవారం పర్యటించారు. పూసురు-ముల్లెకట్ట వంతెన వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు. గోదావరి పూజలు నిర్వహించిన సీతక్క అధికారులతో వరద ఉధృతిపై చర్చించారు. బొగత జలపాతం వద్ద ఏర్పాటు చేసిన ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాల్లో ముందుంచాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. మహిళలు స్వావలంబన సాధించేలా ప్రత్యేక కార్యాచరణతో కృషి చేస్తున్నారని తెలిపారు. బొగత జలపాతం అనతికాలంలోనే ఎంతో ప్రాముఖ్యత పొందిందని, అలాంటి చోట మహిళాశక్తి క్యాంటీన్ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని అన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు స్థానిక వంట కాలను అందించొచ్చన్నారు. మహిళా శక్తి క్యాంటీన్లను అన్ని జిల్లాల్లో ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం వనమహోత్సవంలో భాగంగా బొగత వద్ద మొక్కను నాటారు. బొగత జలపాతాన్ని సందర్శించిన సీతక్క మంత్రముగ్ధులయ్యారు. జలపాతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. మంత్రి వెంట అడిషనల్ కలెక్టర్ శ్రీజ, ఓఎస్డీ మహేష్ గితే బాబా సాహెబ్, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్ ఉన్నారు.

పెనుగోలు వాసులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం..

పెనుగోలులో నివసిస్తున్న గిరిజనులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని మంత్రి సీతక్క తెలిపారు. బొగత కు వచ్చిన మంత్రికి పెనుగోలు కాలనీ వాసులు పలు సమస్యలపై వినతిపత్రం అందించారు. దీనిపై ఆమె స్పందిస్తూ వరదలు తగ్గుముఖం పట్టిన అనంతరం పెనుగోలు గిరిజనులకు అందరికీ ఇళ్లస్థలాలు ఇచ్చి అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. పెనుగోలు గుట్టలపై నివాసం ఉంటున్న వారిని కిందకు దింపుతామన్నారు. .

వరదల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. వాజేడుకు వచ్చి మంత్రి సీతక్క మీడియాతో

మిగతా 8వ పేజీలో..



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశా కార్యకర్తలు

కలెక్టరేట్ ఎదుట ధర్నా

ములుగు కలెక్టరేట్, జూలై 22: ఆశా కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన హామీలు, కమిషనర్‌తో జరిగిన చర్చల హామీలు వెంటనే అమలుకు పూనుకోవాలన్నారు. ఆశా కార్యకర్తలకు రిజిష్టర్లు, రికార్డులు ఇవ్వాలని, రూ.50 లక్షల ప్రమాదబీమా, అంత్యక్రియల ఖర్చులు రూ.50వేలు అందించాలని, ప్రతినెలా 2న వేతనాలు అందించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని అన్నారు. జాబ్‌చార్ట్ రూపొందించాలని, సీనియర్ ఆశాలకు రెండో ఏఎన్ఎంలుగా పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండెబోయిన రవిగౌడ్, ఆశా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రత్నం నీలాదేవి, ఆశాలు చుంచు మంజుల, శ్రావ్య, నాగమణి, శోభ, రాజ్యలక్ష్మి, కవిత, ప్రభావతి, కనకలక్ష్మి, జ్యోతి, దేవేంద్ర, సమ్మక్క, కుమారి, రాధ, మాధవి, సౌజన్య, సుధారాణి, సరిత, రజిత, అరుణ, పార్వతి, సవిత, అనిత పాల్గొన్నారు.

పీడ కలకు ఏడాది! 7

- గత వానాకాలంలో మోరంచపల్లిని ముంచేసిన వరద
- వరదల్లో ఐదుగురి గల్లంతు, ముగ్గురి మృతదేహాలు లభ్యం
- ఇప్పటికీ దొరకని మరో ఇద్దరి ఆచూకీ
- ఈ ఏడాది మళ్లీ ఏం జరుగుతుందోనని ఆందోళన

పరవళ్లు తొక్కుతున్న గోదావరి

- కాళేశ్వరం వద్ద మొదటి హెచ్చరిక జారీ
- రామన్నగూడెంలో రెండో ప్రమాద హెచ్చరికకు చేరువ



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద ఉగ్రరూపం దాల్చిన గోదావరి



కాళేశ్వరం పుష్కరఘాట్ వద్ద గోదావరి ప్రవాహం

మహదేవపూర్, జూలై 22 : భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర త్రివేణి సంగమం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. దీంతో అధికారులు సోమవారం మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆరు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు ప్రాణహిత, గోదావరి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువన మహారాష్ట్రతోపాటు తెలంగాణలో కురిసిన భారీ వర్షాలు కురవడం, సరస్వతీ బ్యారేజీ, సుందిళ్ల బ్యారేజీ గేట్లు ఎత్తడం, మానేరు నది పోటెత్తడంతో కాళేశ్వరం వద్ద గోదావరి ప్రవాహం భారీగా పెరిగింది. మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసిన అధికారులు గోదావరి వద్దకు ఎవరూ వెళ్లొద్దని సూచిస్తున్నారు. ఉదయం నుంచే మహదేవపూర్ తహసీల్దార్‌తో పాటు ఎంపీడీవో, సిబ్బంది, పోలీసు యంత్రాంగం గోదావరి వద్దనే ఉండి ఎవరినీ అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు చెబుతున్నారు. కాళేశ్వరం వద్ద 13లక్షల 50 వేల క్యూసెక్కుల వరద దిగువకు వెళ్తోందని అధికారులు తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు కాళేశ్వరం వద్ద పుష్కరఘాట్‌ను సందర్శించారు. అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని, గోదావరి లోపలికి ఎవరూ వెళ్లొద్దని సూచించారు. ఆయన వెంట మండల స్పెషల్ ఆఫీసర్, డీఈల్‌పీవో వీరభద్రయ్య, తహసీల్దార్ రాథోడ్ ఉన్నారు.

రామన్నగూడెం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

ఏటూరునాగారం రూరల్ : గోదావరి మహోగ్రరూపం దాల్చింది. ఎగువ ప్రాంతాల్లోని ప్రధాన ప్రాజెక్టులు ద్వారా భారీగా వరద నీరు చేరుతుండటంతో మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. పుష్కరఘాట్ వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. సోమవారం తెల్లవారుజామున పుష్కరఘాట్ వద్ద 14.910 మీటర్ల నీటిమట్టం నమోదు కాగా నీటిపారుదల శాఖ అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఉదయం 8 గంటలకు పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 15.190 మీటర్ల చేరింది. మధ్యాహ్నం 2 గంటలకు 15.580 మీటర్లకు చేరుకుంది. సాయంత్రం 5 గంటలకు 15.680 మీటర్లకు చేరుకొని రెండవ ప్రమాద హెచ్చరికకు చేరువలో ప్రవహిస్తోంది. పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటిమట్టం 15.830 మీటర్ల చేరితే రెండో ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయనున్నారు. గోదావరికి వరద ఉధృతి వేగంగా పెరుగుతుండడంతో అప్రమత్తమయ్యారు. ముంపు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికను జారీ చేస్తున్నారు. రెండో ప్రమాద హెచ్చరికను దాటి గోదావరి ప్రవాహం ఉంటే వెంటనే ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వెంకటాపురంలో..

వెంకటాపురం(నూగూరు) : మండలంలో గత వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు పొంగిపొర్లడంతోపాటు గోదావరి పరవళ్లు తొక్కుతోంది. దీంతో మండలం జలదిగ్బంధంలో ఉంది. మండలానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరుతుం డటంతో మండల పరిధిలోని ఎదిర గుట్టల వద్ద రోడ్డుపైకి వరదనీరు చేరింది. బోదాపురం కుక్కతోగువాగు వంతెనపై వరదనీరు ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.

పేరూరు వద్ద..

వాజేడు : గోదావరి తగ్గుముఖం పట్టడం లేదు. పేరూరు వద్ద సోమవారం సాయంత్రం 6 గంటలకు 56 అడుగులకు నీటిమట్టం నమోదైంది. ఎగువన ఉన్న బ్యారేజీల నుంచి నీటిని కిందకు విడుదల చేస్తుండటంతో వాజేడు మండలంలోని గోదావరికి వరద భారీగా చేరకుంటోంది. ఉదయం 7 గంటలకు 16.60 మీటర్లు ఉన్న నీటిమట్టం 10 గంటలకు 17.02 మీటర్లు, 12గంటలకు 17.11 మీటర్లు, ఒంటి గంటకు 17.15 మీటర్లు, 3 గంటలకు 17.23 మీటర్లు సాయంత్రం 6గంటలకు 17.29 మీటర్ల నీటిమట్టం చేరుకొని ప్రవహిస్తోందని సీడబ్ల్యూసీ అధికారులు వివరించారు.


కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్ వద్ద..

మంగపేట: భారీ వర్షాలకు వాగులు, వంకలు, ఒర్రెలు పొంగి పొర్లడంతోపాటు ఎగువ ప్రాంతాల్లోని ప్రాజెక్టుల గేట్లను ఎత్తివేయడంతో

మిగతా 8వ పేజీలో..

మేడిగడ్డ బ్యారేజీకి పోటెత్తిన వరద

- 9.36లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 85గేట్ల ఎత్తివేత.. దిగువకు అంతే నీరు
- అన్నారం బ్యారేజీలోకి 19,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



మేడిగడ్డ బ్యారేజీ వద్ద వరద ఉధృతి

మహదేవపూర్ రూరల్, జూలై 22 : కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మేడిగడ్డ బ్యారేజీకి వరదనీరు పోటెత్తుతోంది. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రాణహిత నది ఉగ్రరూపం దాల్చింది. దీంతో గోదావరికి భారీ స్థాయిలో వరద వచ్చి చేరుతోంది. సోమవారం ఉదయం నుంచి క్రమంగా పెరుగుతూ వచ్చిన వరద సాయంత్రానికి 9.36 లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో బ్యారేజీ 85 గేట్లను ఎత్తి, దిగుకు అంతే నీటిని పంపిస్తున్నారు. సోమవారం బ్యారేజీ వద్ద 9 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది. అన్నారం బ్యారేజీకి 19,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో చేరుతుండగా 66 గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. మంగళవారం ఉదయం వరకు అన్నారం బ్యారేజీకి ఇన్‌ఫ్లో పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

సమ్మక్క బ్యారేజీలోకి 10,15,170 క్యూసెక్కులు

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని సమ్మక్క సాగర్ బ్యారేజీ, గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు వద్ద గోదావరి నిలకడగా ప్రవహిస్తోంది. ఎగువన ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తి దిగువకు నీళ్ల వదులుతుండటంతో పాటు గోదావరికి ఉప నదులైన ప్రాణహిత, ఇంద్రావతి నదులు నుంచి వస్తున్న వరద నీటితో ప్రవాహం పెరిగింది. సోమవారం మధ్యాహ్నం 12 గంటల వరకు ఉధృతంగా ప్రవహించిన గోదావరి మధ్యాహ్నం 3 గంటల నుంచి నిలకడగా ఉంది. మధ్యాహ్నం 12 గంటలకు ఇన్‌ఫ్లో 10,04,530 క్యూసెక్కులు ఉండగా మధ్యాహ్నం 3గంటలు, సాయంత్రం 6 గంటలకు 10,15,170 క్యూసెక్కులు నమోదైంది. ప్రాజెక్టుల్లోకి భారీగా వరద ఉధృతి కొనసాగుతుండటంతో మొత్తం గేట్లు ఎత్తి, వచ్చిన నీటిని వచ్చినట్లు దిగవకు వదులుతున్నారు. బ్యారేజీ పూర్తిస్థాయి నీటిమట్టం 83.00 మీటర్లు కాగా 84.10 మీటర్లు నమోదైంది. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 84.70 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

కాంగ్రెస్‌వి అసత్య ప్రచారాలు


- బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు



మేడిగడ్డ బ్యారేజీ వద్ద మీడియాతో మాట్లాడుతున్న పుట్ట మధు

మహదేవపూర్ రూరల్, జూలై 22: మేడిగడ్డ బ్యారేజీపై కాంగ్రెస్ అసత్య ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు విమర్శించారు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని ఆయన సోమవారం సందర్శించారు. బ్యారేజీ వద్ద ప్రస్తుతం 10 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని, కుంగిన రెండు పిల్లర్లను బూచీగా చూపిస్తూ యావత్ కాళేశ్వరం ప్రాజెక్టే పనిచేయదంటూ కాంగ్రెస్ అసత్యాన్ని ప్రచారం చేస్తోందని దుయ్యబట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ ఒక బ్యారేజీ మాత్రమేనని అన్నారు. పదుల సంఖ్యలో టన్నెల్స్, రిజర్వాయర్స్, పంప్‌హౌజ్‌లు కలిస్తేనే కాళేశ్వరం ప్రాజెక్టు అని అన్నారు. రూ. 4వేల కోట్లతో కట్టిన మేడిగడ్డ బ్యారేజీలో రూ. 200కోట్ల నష్టం వాటిల్లితే రూ. లక్షకోట్ల అవినీతి జరిగిందంటూ యావత్ తెలంగాణ సమాజాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. త్వరలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మేడిగడ్డ వద్ద పర్యటించనున్నారని తెలిపారు. మధు వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్ రావు, నాయకులు అలీంఖాన్, శ్రీపతిబాపు, అన్నారి ప్రకాశ్, పెండ్యాల మనోహర్ తదితరులు ఉన్నారు.















'కల'గానే సొంతిళ్లు!

(5వ పేజీ తరువాయి)

లేకపోవటంతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. సాయంత్రం వేళల్లో మందు బాబులకు అడ్డాగా మారుతున్నాయి. పంచాయతీలు, సెటిల్‌మెంట్‌లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లనే వాడుతున్నారు. వరంగల్ నగర శివారులోని దూపకుంట ప్రాంతంలో గంజాయి, డ్రగ్స్‌లాంటి వాటిని తీసుకునేందుకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను వినియోగిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. వ్యభిచారాలకు కూడా వాడుకుంటున్నారనే చర్చ ఉంది. ఈ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు రక్షణ లేకపోవటంతో ఇష్టారాజ్యంగా వాటిని వినియోగించుకుంటున్నారనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

లబ్ధిదారుల ఆందోళనలు



హనుమకొండ అంబేద్కర్ నగర్‌లో ఆదివారం డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల తాళాలు పగులగొట్టిన లబ్ధిదారులు

హనుమకొండలోని బాలసముద్రం ఇళ్లను పంపిణీ చేయాలని లబ్ధిదారులు ఆదివారం రాత్రి ఆందోళనకు దిగారు. నిర్మాణం పూర్తైన ఇళ్లలోకి వెళ్లటంతో పోలీసులు జోక్యం చేసుకోవల్సి వచ్చింది. అలాగే భూపాలపల్లి పట్టణంలోని 430 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించాలని గత నెలలో నాలుగు రోజులు ఆందోళనకు దిగారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్‌లో నిర్మించిన 712 ఇళ్ల పేదలకు పంపిణీ చేయాలని కలెక్టర్‌ను కలిసి స్థానికులు విజ్ఞప్తి చేశారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం గూడూరులో 70 ఇళ్ల నిర్మాణం పూర్తి కాగా, వాటిని పంపిణీ చేయకపోవటంతో 40ఇళ్లలో తలుపులు తీసుకుని స్థానికులు నివాసం ఏర్పాటుకు ప్రయత్నించారు. వారంలో గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని హామీ ఇచ్చి దాటవేశారు. ఇలా ఉమ్మడి వ్యాప్తంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల ఖాళీగా ఉండటంతో వాటిని తమకు కేటాయించాలని లబ్ధిదారులు ఆందోళన బాట పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని లబ్ధిదారులకు డిమాండ్ చేస్తున్నారు.







దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి

ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్



ఇల్లందలో కండ్లకు గంతలు కట్టి నిరసన వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

వర్ధన్నపేట రూరల్, జూలై 22: రాష్ట్రంలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఇల్లందలో రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్లు అవసరమా? అంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ స్మితా సభర్వాల్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఉన్న హక్కులను, చట్టాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకుండా, దివ్యాంగుల సమాజాన్ని అడుగడుగునా విస్మరిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో పోటీ చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే భారత వికలాంగుల సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్మితా సభర్వాల్ వ్యాఖ్యలకు నిరసన కండ్లకు నల్లగంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి నర్సింహులు, రాష్ట్ర మహిళా నాయకురాలు గుడపల్లి సుమతి, మండల అధ్యక్షుడు జట్టబోయిన శ్రీనివాస్, రాయపర్తి మండల అధ్యక్షుడు ఇస్లావత్ బాలకృష్ణ, నల్గొండ జిల్లా అధ్యక్షుడు చిన్నపాక మత్స్యగిరి, నాయకులు షారుబ్, వెంకన్న, ముత్తయ్య, రమేష్, హరీఫ్ పాల్గొన్నారు.

వర్సిటీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



రిజిస్ట్రార్ మల్లారెడ్డికి వినతి పత్రాన్ని ఇస్తున్న ఉద్యోగసంఘం నేతలు

కేయూ క్యాంపస్, జూలై 22: వర్సిటీలో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ పుల్లా శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డిని కలిసి తమసమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2013లో నియమితులైన బోధనేతర ఉద్యోగులందరికీ పే రివిజన్ జీతాలు ఇవ్వాలని, 2010లో నియమితులైన బోధన ఉద్యోగులను క్రమబద్ధీకరించా లని కోరారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. ఏఆర్, సూపరింటెండెంట్, ల్యాబ్ అసిస్టెంట్, టెక్నీషియన్-2, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్, రికార్డు అసిస్టెంట్, బుక్ కీపర్ ఉద్యోగాలకు ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. వర్సిటీలో పనిచేస్తున్న రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలని అన్నారు. పీహెచ్‌డీ పూర్తిచేసిన ఉద్యోగులకు కోర్సు కోఆర్డినేటర్‌గా ప్రమోట్ చేయాలన్నారు. 2013 టెస్ట్ కోటా మేరకు జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగాలివ్వాలని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఎస్డీఎల్‌ఈసీ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, బొక్క మొగిలి, దామెర ప్రభాకర్, నమిండ్ల కిరణ్‌కుమార్, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా మహేందర్

కేయూ క్యాంపస్, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ వేశాల మహేందర్ బాధ్యతలు చేపట్టారు. మహేందర్ ఇప్పటి ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ మంచాల సదానందం స్థానంలో విధులు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా కోఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల అసిస్టెంట్ రిజిస్ట్రార్ నేతాజీ, సూపరింటెండెంట్ బొల్లెపాక ప్రభాకర్ నేతృత్వంలో ప్రిన్సిపాల్ మహేందర్‌కు పుష్పగుచ్ఛం అందచేసి శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.సదాశివుడు, డాక్టర్ సంగాల ఎప్రామ్‌రాజ్, ఆనంద్, బి.శోభారాణి, మంద శ్యాం, పున్నం చందర్, పి.గౌతమి తదితరులు పాల్గొన్నారు.



మహేందర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కళాశాల సిబ్బంది

ఆర్టీసీ అధికారులపై సస్పెన్షన్ వేటు

బాలసముద్రం, జూలై 22: వరంగల్ రీజియన్ పరిధిలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అకౌంట్ ఆఫీసర్ లావణ్యను ఆర్టీసీ ఉన్నతాధికారులు సోమవారం సస్పెండ్ చేశారు. వరంగల్‌లో లావణ్య అద్దె బస్ ఓనర్ల నుంచి, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టర్లను వేధించడం, పెన్షనర్ల సెటిల్‌మెంటుకు డబ్బులు డిమాండ్ చేసిన ఆరోపణలపై విజిలెన్స్ డిపార్టుమెంట్ ఎంక్వైరీ చేశారు. ఈ నివేదిక అందుకున్న ఆర్టీసీ ఉన్నతాధికారులు ఏవో లావణ్యను సస్పెండ్‌చేసినట్లు సోమవారం తెలిపారు. ఏవో లావణ్యకు సహకరించాడని అసిస్టెంట్ మేనేజర్‌గా ఫైనాన్స్ ఏవోగా ప్రమోషన్‌పై రంగారెడ్డి జిల్లాకు వెళ్లిన రాంమోహన్‌ను సైతం సస్పెండ్ చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

28 నుంచి కేయూ దూరవిద్య పీజీ కోర్సుల తరగతులు

కేయూ క్యాంపస్, జూలై 22: కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం 2023-24 ఏడాది ఎంఏ పొలిటికల్ సైన్స్, సోషియాలజీ, ఇంగ్లీష్, ఎంకామ్ కోర్సుల ప్రథమ ఏడాది ప్రథమ సెమిస్టర్, రెండో ఏడాది కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తామని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ దూర విద్య కేంద్రంలో జరిగే తరగతులను అభ్యర్థులందరూ హాజరు కావాలని కోరారు. మిగతా కోర్సుల కాంట్రాక్టు తరగతులను వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించారు.

రెడ్‌క్రాస్ కమిటీలో కొత్త వారికి అవకాశం

ఆరేళ్లు దాటితే తప్పుకోవాల్సిందే : గవర్నర్ ఆదేశాలు

వరంగల్ మెడికల్, జూలై 22: రాష్ట్రవ్యాప్తంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీల్లో కొత్తవారికి అవకాశం కల్పించాలని రాష్ట్ర గవర్నర్ ఆదేశించారు. ఈ మేరకు రాజ్‌భవన్ నుంచి తాజాగా లేఖ నెంబర్ 681/టి2/ఎస్/2024 విడుదలైంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కమిటీల్లో కీలక బాధ్యులుగా ఎన్నికై ఆరేళ్లకు పైగా కానీ, రెండు విడతలుగా కానీ కొనసాగుతున్న వారు ఇకపై స్వచ్ఛందంగా తప్పుకోవాల్సిందేనని లేఖలో పేర్కొంది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి రాష్ట్ర స్థాయిలో గవర్నర్ అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. జిల్లా కమిటీలో 10 నుంచి 15 మంది వరకు సభ్యులుంటారు. ఇందులో కీలక పదవుల్లో ఉన్న రాష్ట్ర కమిటీ సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి ఆరేళ్లు పూర్తి చేసుకున్న, రెండు విడతల పదవీ పూర్తిచేసుకున్న వారు వెంటనే స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

రేసులో ముగ్గురు

హనుమకొండ జిల్లా రెడ్‌క్రాస్‌సొసైటీ చైర్మన్‌గా డాక్టర్ విజయచందర్‌రెడ్డి చాలా ఏళ్లుగా పని చేస్తున్నారు. గవర్నర్ లేఖతో ఆయన స్వచ్ఛందంగా తప్పుకుంటే ఈ పదవికోసం ముగ్గురు పోటీ పడుతున్నారు. డాక్టర్ శేషు మాధవ్, డాక్టర్ హరి సంధ్యారాణి, పెద్ది వెంకట నారాయణగౌడ్ పోటీ పడుతున్నారు.

నిజాం నిరంకుశ పాలనను ఎదురించిన ధీశాలి దాశరథి

దాశరథి రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి : ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్



మహబూబాబాద్‌లో జరిగిన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, జూలై 22: నిజాం నిరంకుశ పాలనను ఎదిరించి పేదల పక్షాన నిలిచి కవిత్వాన్ని రాసిన మహాకవి దాశరథి ఆశయాలను ముందుకు తీసుకుపోవాల్సిన అవసరం మనందరిపై ఉందని ఎమ్మెల్సీ, కవి దేశపతి శ్రీనివాస్ అన్నారు. దాశరథి జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎం ఫంక్షన్ హాల్‌లో సోమవారం దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శత జయంతి సభ నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ముఖ్యవక్తగా హాజరైన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడారు. దాశరథి తన 20వ ఏటనే పోరాటాల బాట పట్టి నిరంకుశ పాలన సాగిస్తున్న నిజాం నవాబును ఎదిరించారని చెప్పారు. నిజామాబాద్ జైలులో బంధిస్తే అక్కడ బొగ్గు ముక్కతో ఓ నిజాం పిశాచమా అంటూ రాసి ఉద్యమాన్ని రగిల్చిన గొప్ప వ్యక్తి దాశరథి అని కొనియాడారు. జైలులో బంధించినప్పటికి సింహంలా గర్జించారని గుర్తుచేశారు. ఆయన ప్రజల కోసమే కవిత్వం రాసేవారని, తన రచనలు తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తిగా నిలిచాయని పేర్కొన్నారు. దాశరథి అంటేనే తెలంగాణ... తెలంగాణ అంటేనే దాశరథి అని తెలంగాణ అస్థిత్వాన్ని తన కవిత్వంలో చూపించారని పేర్కొన్నారు. భూస్వాములకు వ్యతిరేకంగా పోరాడుతూ సమాజంలో దుర్మార్గం, వెట్టిచాకిరి విముక్తి తన కర్తవ్యంగా పనిచేశారని తెలిపారు. ప్రజా కవులు దాశరథి, కాళోజీల జీవిత చరిత్రలు చదివితే తెలంగాణ గూర్చి తెలుస్తుందని, సరళమైన పదాలతో అందరికి అర్థమయ్యే రీతితో దాశరథి కవిత్వం ఉండేదన్నారు. ఆంగ్ల కవి షేక్స్‌పియర్ కంటే గొప్ప కవి దాశరథి అన్నారు.

ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ మాట్లాడుతూ.. ప్రజల కష్టాలు, జీవితాలు ప్రతిబింబాలుగా దాశరథి కవిత్వం ఉండేదని, ఆయన దేశం గర్వించదగ్గ కవి అని కొనియాడారు. ప్రజలను చెడు మార్గంలోకి వెళ్లకుండా సన్మార్గంలో నడిపించేది కవిత్వమని, దాశరథి గొప్ప మేధావి అని, ఆయన పుట్టిన గడ్డలో తాను ఎమ్మెల్యేగా పనిచేయడం అదృష్టమని చెప్పారు. దాశరథి సంపద పుస్తకాలేనని అలాంటి మహనీయుడిని ప్రజల్లోకి తీసుకువెళితే తెలుగును బతికించుకున్న వారమవుతామని తెలిపారు. నా తెలంగాణ కోటి రతనాల వీణ స్వరాష్ట్ర ఉద్యమానికి ఊతమిచ్చిందని చెప్పారు.

ప్రముఖ కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిద్ధారెడ్డి మాట్లాడుతూ.. దాశరథి మన మధ్య లేకపోయినా జ్ఞాపకాలు మిగిలే ఉన్నాయని అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో దాశరథి శత జయంతి ఉత్సవాలు జరగాలని ఆకాంక్షించారు. జాగీరు దారులకు వ్యతిరేకంగా గర్జిస్తూ ప్రజల కోసం.. పాలకులను ప్రశ్నిస్తూ తన కవితలను రాసిన మహా కవి దాశరథి అని తెలిపారు. టీఎన్జీవోస్ పూర్వ అధ్యక్షుడు దేవీప్రసాద్ మాట్లాడుతూ.. దాశరథి పోరాట వారసత్వాన్ని ఈ సమాజానికి అందించాలన్నారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ మాట్లాడుతూ.. ప్రజల కోసం తన జీవితాన్ని పణంగా పెట్టి నిజాం నవాబును ధిక్కరించిన కవి దాశరథి అని చెప్పారు. చిన్నగూడూరుకు దాశరథి మండలంగా పేరు పెట్టాలని కోరారు. ఎమ్మెల్సీ, దాశరథి శత జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు మాట్లాడుతూ.. దాశరథిని స్మరించుకుంటూ ఆయన జీవిత చరిత్రను భావితరాలకు అందిస్తూ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని చెప్పారు. జిల్లాలో సంవత్సర కాలం పాటు దాశరథి జయంతి ఉత్సవాలను జరిపి ముగింపు సభను జిల్లా కేంద్రంలో పెద్ద ఎత్తున నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అనంతరం సభకు హాజరైన వక్తలు, అతిథులను శాలువాలతో సత్కరించి మెమెంటోలను అందజేశారు. చివరగా కవి సమ్మేళనాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, టీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు అడ్డగోడ రాజేష్, ఉత్సవ కమిటీ చిన్నగూడూరు మండల అధ్యక్షుడు గునిగంటి కమలాకర్, కవి గుర్రపు సత్యనారాయణ, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ డాక్టర్ నాగవాణి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు, బానోత్ రవికుమార్, ఎడ్ల వేణు, కొండపల్లి కరుణాకర్‌రెడ్డి, కన్న, జెరిపోతుల వెంకన్న, కవులు, దాశరథి అభిమానులు పాల్గొన్నారు.

గాయని సనశ్రీకి రికార్డుల పంట



సనశ్రీకి రికార్డుల పత్రాలను అందజేస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, జూలై 22: నగరానికి చెందిన ప్రముఖ గాయని సనశ్రీ తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో ఏకధాటిగా 8 గంటల పాటు 108 పాటలను ఆహూతుల సమక్షంలో ఆలపించి ప్రశంసలు అందుకుంది. అంతేగాక తెలుగు బుక్‌ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డులలో సనశ్రీ పేరును నమోదు చేసుకోవడం విశేషం. ఈ అపూర్వ కార్యక్రమానికి హనుమకొండలోని వాగ్దేవి కళాశాల ఆడిటోరియం వేదికగా నిలిచింది. ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయే వరకు జరిగిన ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులు పాల్గొని సనశ్రీని ప్రశంసలతో ముంచెత్తారు. కాకతీయ మ్యూజికల్ క్లబ్ వ్యవస్థాపకుడు రంగు రఘుపతి ఆధ్వర్యంలో జరిగిన ఈ అపూర్వ వేడుకలను ఉదయం ప్రముఖ సంగీత విద్వాంసుడు ఆచార్య తిరుపతయ్య లాంఛనంగా ప్రారంభించగా నగరానికి చెందిన అనేక మంది ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని తిలకించి గాయని సనశ్రీని అభినందించారు. ఈ అవార్డులను జ్యూరీ మెంబర్ టీవీ అశోక్ కుమార్ హాజరై అందజేశారు.



మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీసీ దేవేందర్‌రెడ్డి

ఇద్దరు ఏటీఎం దొంగల అరెస్టు

కార్డులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం : ఏసీసీ దేవేందర్‌రెడ్డి

హనుమకొండ టౌన్, జూలై 22: ఏటీఎం కేంద్రాల్లో డబ్బులు దొంగలించే ఇద్దరు దొంగలను హనుమకొండ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. హనుమకొండ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితులకు సంబంధించిన వివరాలను ఏసీపీ దేవేందర్‌రెడ్డి వెల్లడించారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫతేపూర్‌కు చెందిన శుభం, ప్రియాంక అనే ప్రేమజంటకు బట్టలషాప్‌లో పనిచేసే శివవీర్ సింగ్, అనిశ్‌సింగ్, సత్యవీర్, ప్రియాంక సింగ్, ఓ మైనర్ పరిచయమయ్యారు. కిందటేడు నుంచి ఆంధ్రప్రదేశ్, నాగపూర్, చంద్రపూర్ తీసుకెళ్లి దొంగతనం ఎలా చేయాలో శుభం, అతడి ప్రియురాలు నేర్పించారు. తర్వాత హనుమకొండ, వరంగల్‌లో కెనరా, ఎస్‌బీఐతో కలిపి 6 ఏటీఎంలలో విడతల వారీగా రూ.25,500 దొంగలించారు. తాజాగా సోమవారం హనుమకొండలోని కెనరా బ్యాంకు ఏటీఎంను ధ్వంసం చేసి డబ్బులు దొంగలించేందుకు ప్రయత్నిస్తుండగా పక్కాసమాచారంతో హనుమకొండ పోలీసులు అక్కడికి వెళ్లి శివవీర్ సింగ్, అనిశ్‌సింగ్‌లతోపాటు ఒక మైనర్‌ను పట్టుకున్నారు. వీరి నుంచి దొంగలించడానికి వినియోగించిన సామగ్రి, రెండు ఏటీఎంలు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కాగా ప్రధాన నిందితులు శుభం, అతడి ప్రియురాలు ప్రియాంకతో పాటు సత్యవీర్, ప్రియాంక సింగ్ పరారీలో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో హనుమకొండ సీఐ వై.సతీష్, సీసీఎస్ సీఐ అబ్బయ్య, ఎస్సై సతీష్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏనుమాముల మార్కెట్ గ్రేడ్ -2 కార్యదర్శిగా అజిత్‌రావు



అజిత్ రావు

వరంగల్ వ్యవసాయం, జూలై 22: ఏనుమాముల(వరంగల్) వ్యవసాయ మార్కెట్ కమిటీ గ్రేడ్-2 కార్యదర్శిగా దన్నపునేని అజిత్‌రావు బదిలీ అయ్యారు. ఇటీవల మార్కెటింగ్ శాఖ అధికారులు నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా భువనగిరి వ్యవసాయ మార్కెట్ కార్యదర్శిగా పనిచేస్తున్న అజిత్‌రావును ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. బదిలీ ఉత్తర్వులు అందగానే బాధ్యతలు చేపడుతానని అజిత్‌రావు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన సూపర్‌వైజర్లు



మార్కెట్ కార్యదర్శి నిర్మలకు సూపర్‌వైజర్ల సత్కారం

మార్కెటింగ్‌శాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా వర్ధన్నపేట మార్కెట్ నుంచి చక్రబహదూర్ రాయ్, నెక్కొండ మార్కెట్ కమిటీ నుంచి అల్లి జ్యోతిప్రకాష్‌ను, నర్సంపేట మార్కెట్ నుంచి ఎండి.సలీంను అలాగే మేకల రజిత జేఎంఎస్‌ను ఏనుమాముల మార్కెట్‌కు బదిలీ చేశారు. కాగా, సోమవారం బదిలీపై వచ్చిన ముగ్గురు సూపర్‌వైజర్లను, ఒక జేఎంఎస్ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మలను మర్యాదపూర్వకంగా కలిసి బదిలీ ఉత్తర్వులను అందించారు. అనంతరం వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి నిర్మలను సత్కరించారు. కార్యక్రమంలో గ్రేడ్ కార్యదర్శి రామోజు రాము, అసిస్టెంట్ సెక్రటరీలు రాజ్‌కుమార్, గందమల్ల రాజేందర్, సూపర్‌వైజర్లు నల్ల నర్సింగరావు, గంగాధర్, భూక్యా వెంకన్న నాయక్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యులు

తెలంగాణ హెర్నియా సొసైటీ ఏర్పాటు

వరంగల్ మెడికల్, జూలై 22: కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్ఆర్ఐక్యాంప్‌లో హెర్నియా సర్జన్స్ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెర్నియా సొసైటీ ఆఫ్ తెలంగాణ ఆవిర్భావం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో హెర్నియా సొసైటీ ఆఫ్ తెలంగాణ ఏర్పాటుకు కమిటీ చైర్మన్‌గా డాక్టర్ కూరపాటి రమేశ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా నామినేట్ చేశారు. అనంతరం డాక్టర్ ఉమాకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆధునిక లాపరోస్కోపీ సేవలు అందించడానికి డాక్టర్ కూరపాటి రమేష్, ఇతర సభ్యులు బాధ్యత వహించి సేవలను విస్తత పర్చాలన్నారు. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేశ్ చంద్రహరి తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగరవేయాలి

బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్

వడ్డెపల్లి, జూలై 22: బీసీలు ఆశించే స్థాయి నుంచి.. శాసించే స్థాయికి ఎదగాలనే సంకల్పంతో దేశమంతా బీసీ ఉద్యమాన్ని విస్తరించి, ఢిల్లీ కోటపై బహుజన జెండాను ఎగరవేసేందుకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో ఉద్యమాలు కొనసాగుతున్నాయని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ అన్నారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో 60శాతంపైగా ఉన్న బీసీలు.. విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో ప్రాతినిధ్యం లేకపోవడంతో అరశాతం ఉన్న అగ్రవర్ణాలు అధికారాన్ని అనుభవిస్తున్నాయన్నారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లేందుకు ఆగస్టు7న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పంజాబ్ రాష్ట్రం అమృతసర్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్‌లోగల ద గోల్డెన్‌జూబ్లీ సెలబ్రేషన్ హాల్‌లో అఖిల భారత జాతీయ ఓబీసీ 9వ మహాసభలను నిర్వహిస్తున్నామని బీసీ సమాజమంతా పాల్గొని విజయవంతం చేయాలని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ కోరారు. మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాడి మల్లయ్య యాదవ్, రాష్ట్ర, జిల్లా నాయకులు బచ్చు ఆనందం, తాళ్ల సంపత్ కుమార్, కాసగాని అశోక్ గౌడ్, పంజాల మధు, దాడి రమేష్, కురిమిళ్ల శ్రీనివాస్, తాళ్లపెల్లి రమేష్, కడారి అనిల్, పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

న్యాయవాది శంకర్ ప్రసాద్‌రావుకు నివాళి



సంతాప కార్యక్రమంలో పాల్గొన్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, జూలై 22: సీనియర్ న్యాయవాది కె.శంకర్‌ప్రసాద్‌రావు మృతికి హనుమకొండ, వరంగల్ బార్ అసోసియేషన్లు ఘనంగా నివాళులర్పించారు. సోమవారం వరంగల్ అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 20న అనారోగ్యంతో మృతిచెందిన శంకర్ ప్రసాద్‌రావు హనుమకొండ పట్టణం అడ్వకేట్స్‌కాలనీకి చెందినవారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. 1995 నుంచి వరంగల్ జిల్లా కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్నారు.

అంతకుముందు హనుమకొండ జిల్లా కోర్టు హాల్‌లో జిల్లా ప్రధానసెషన్స్ జడ్జి సీహెచ్.రమేష్‌బాబు ఆధ్వర్యంలో సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతాంబ, ఇరు జిల్లాలకు చెందిన అదనపు జిల్లా జడ్జిలు, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, ప్రభుత్వ న్యాయవాది కె.నర్సింహరావు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తీగల జీవన్‌గౌడ్ అధ్యక్షతన సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శులు లాడే రమేష్, ముదసర్ అహ్మద్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు బైరపాక జయాకర్, దుస్స జనార్థన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా కళ్లల్లోనే ఆ పీడ కల

మోరంచపల్లిని ముంచేసిన వరదకు ఏడాది

- భారీగా వాటిల్లిన ప్రాణ, ఆస్తి, పంట నష్టం
- వరదల్లో ఐదుగురి గల్లంతు.. ముగ్గురి మృతదేహాలు లభ్యం
- ఇప్పటికీ దొరకని మరో ఇద్దరి ఆచూకీ
- ఆ కాళరాత్రినే తలుచుకుంటూ వణికిపోతున్న గ్రామస్థులు



గతేడాది వచ్చిన వరదతో మునిగిపోయిన మోరంచపల్లి గ్రామం (ఫైల్)

కృష్ణకాలనీ(భూపాలపల్లి), జూలై 22: మోరంచపల్లి... భూపాలపల్లి జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉండే ఓ గ్రామం. ఆ ఊరికి వరద ఎలా ఉంటుందో ఎప్పుడు తెలియదు. కానీ, గతేడాది జూలై 27న అకస్మాత్తుగా భారీ వరద ఊరిని ముంచెత్తింది. క్షణాల్లో ప్రళయం అంటే ఎలా ఉంటుందో ఆ ఊరిజనాలకు ప్రత్యక్షంగా కళ్ల చూపింది. నాటి ఈ దుర్ఘటనలో మొత్తం ఐదుగురు గల్లంతవగా వారిలో ముగ్గురు మృతదేహాలు లభ్యమయ్యాయి. మరో ఇద్దరి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. వందలాది పశువులు, పెంపుడు జంతువులు మృత్యువాత పడ్డాయి. నాటి పీడకలకు ఏడాది పూర్తి కావస్తున్న వేళ మరోసారి వర్షాలు, వరదలు ప్రారంభం కావడంతో ఆ గ్రామస్థులు మళ్లీ ఉలిక్కి పడుతున్నారు.

ఆ రోజు తెల్లవారుజామున..

ఇంకో గంటయితే తెల్లవారుతుందనేలోపే గ్రామాన్ని వరదనీరు చుట్టుముట్టింది. 2023 జూలై 26న మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షం కారణంగా గణపసముద్రంలోకి నీరు అధికమై మత్తడి పెరగడంతో మోరంచవాగులోకి వరద పెరిగి ఇళ్లలోకి చేరింది. 27న తెల్లవారుజామున 4గంటల సమయంలో వరద గ్రామానికి తాకింది. అది గ్రహించిన కొంత మంది గ్రామస్థులు.. కుందయ్యపల్లి, కర్కపల్లి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. వరద ముప్పును అంచనా వేయలేకపోయిన వారు ఇళ్లలోనే ఉండిపోవడంతో నీళ్లన్నీ ఇళ్లను ముంచెత్తాయి. ఇళ్ల సజ్జల వరకు నీరు వేగంగా ప్రవహించింది. దీంతో ప్రాణాలు కాపాడుకునేందుకు చాలా మంది ఇళ్ల సజ్జలు, స్లాబులు, చెట్లపైకి ఎక్కారు. ఇదంతా పూర్తిగా తెల్లవారాక సోషల్ మీడియా వేదికగా తమను కాపాడాలని బాధితులు ఫొటోలు, వీడియోలు షేర్ చేయడంతో వారి ఆర్తనాదాలు బహిర్గతమయ్యాయి. అప్పటికప్పుడు అధికార యంత్రాంగం రంగంలోకి దిగి.. సింగరేణి రెస్క్యూ, అగ్నిమాపక రెస్క్యూ సిబ్బంది చేరుకొని వరదల్లో చిక్కుకున్న సుమారు 150 మందిని బోటు సహాయంతో సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ విషయం సంచలనమైంది. అప్పటి ప్రభుత్వం, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో రెండు ఆర్మీ హెలికాప్టర్లు గంటల వ్యవధిలో మోరంచపల్లి గ్రామానికి చేరుకున్నాయి. గ్రామం మీదుగా చుట్టూ ముట్టి పైనుంచి సమీక్షించారు. గ్రామానికి అతి దగ్గరగా ఆ ప్రాంతాన్నంతా పరిశీలించారు.

నాలుగు కుటుంబాల్లో విషాదం

భారీగా వచ్చిన వరదలు నాలుగు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. వరద తాకిడి తట్టుకోలేక ఐదుగురు గల్లంతు అయ్యారు. గ్రామానికి చెందిన గొర్రె ఓదిరెడ్డి, వజ్రమ్మ, గంగడి సరోజన, గడ్డం మహాలక్ష్మితోపాటు గ్రామంలోని శ్మశానవాటికలో తలదాచుకున్న ఓ గుర్తుతెలియని యాచకుడు కొట్టుకపోయారు. వారి కోసం రెస్క్యూ బృందం గాలించినా ఆ రోజు మృతదేహాలు దొరకలేదు. మరుసటి మూడు రోజుల వ్యవధిలో గడ్డం మహాలక్ష్మి, గుర్తుతెలియని యాచకుడు మినహా మిగిలిన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయి. అయితే గడ్డం మహాలక్ష్మి.. భర్త శ్రీనివాస్ కళ్లారా చూస్తుండగానే కొట్టుకుపోవడం, ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరక్కపోవడం, కనీసం మృతదేహం కూడా లభ్యం కాకపోవడంతో ఆమె తిరిగొస్తుందన్న ఆశలు వదులుకున్న భర్త తన భార్య ఇక బతికి రావడం కష్టమేనని భావించి నెలవారీ మాశికాలు నిర్వహించడంతో పాటు ఈనెల 15న ఆమె సంవత్సరీకాన్ని కూడా జరిపించారు.

అపారనష్టం..

మోరంచవాగు వరద ఉధృతి గ్రామస్థులను అన్ని రకాల నష్టాలను చవిచూపింది. మూగ జీవాల మృత్యుఘోష వినిపించింది. గ్రామంలో ఉన్న మూగజీవాలు ఊపిరాడక 153 గేదెలు, 753 కోళ్లు, 3 దుక్కిటెద్దులు, 5 బాతులు మృతి చెందాయి. మరో 50 గొర్రెలు వరదలో కొట్టుపోయాయి. ఇక పంటలకు కూడా తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 25,181 ఎకరాలు నీట మునిగాయి. వీటితో పాటు 1800 ఎకరాల్లో ఇసుక మేటలు వేశాయి. వరి 13,290 ఎకరాలు, 11,891 ఎకరాల్లో పత్తి తీవ్రంగా నష్టాన్ని మిగిల్చింది. ఇక ఇళ్లలోని బియ్యం, దుస్తులు, మంచాలతో పాటు కూలర్, ఫ్రిజ్, టీవీ లాంటి ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు ఇళ్లలోని సామగ్రి మొత్తం తడిసిపోయాయి. అలాగే, ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు వరదలో కొట్టుకుపోయి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఆగిపోయి కనిపించాయి.

కొండంత కష్టం.. గోరంత సాయం..

మోరంచపల్లి గ్రామస్థులకు వచ్చిన కష్టానికి సరిపడా సాయం అప్పటి సర్కారు అందించలేదు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామం మునక వైరల్ అయింది. కానీ, ఈ విషయంపై అప్పటి సీఎం గ్రామం పేరును కూడా కనీసం ప్రస్తావించలేదన్న విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వం తరుపున కేవలం రూ.10వేలు మాత్రమే అందించారు. అలాగే, సింగరేణి తరుపున కార్మికుల నుంచి కొంత మొత్తాన్ని జమ చేసి కుటుంబానికి రూ.15వేలు అందించారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి సొంతంగా రూ.4వేల చొప్పున ఇచ్చారు. మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా ఉన్న ప్రస్తుత ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, తాగునీటిని అందించారు. ఇక వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి తోచిన సహాయాన్ని చేశారు. అయినా వీరికి జరిగిన లోటును మాత్రం పావలా వంతు కూడా పూడ్చలేకపోయింది.



సాయం కోసం వచ్చిన హెలికాప్టర్

పరామర్శలకే పరిమితం?

వరద ఉధృతి మోరంచపల్లిని ముంచేసిందనే వార్త ఆ సమయంలో సంచలనంగా మారింది. సోషల్ మీడియాతో పాటు టీవీచానళ్లు, దినపత్రికలు బాధితులకు అండగా ఉండి వారి బాధలను బహిర్గతం చేశాయి. దీంతో వివిధ పార్టీల నేతలు మోరంచపల్లి బాట పట్టారు. నాడు రాష్ట్ర మంత్రిగా ఉన్న సత్యవతి రాథోడ్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ నేత ఈటల రాజేందర్, బీఎస్పీ నేతగా ఉన్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణమాదిగ, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారాదన్ మహారాజ్ ఇల్లిల్లు తిరిగి బాధితులను పరామర్శించారు. కానీ, వారి కష్టాలను గట్టెక్కించేందుకు మేమున్నామనే భరోసానివ్వలేకపోయారన్న విమర్శలు వ్యక్తమయ్యాయి.

గండి పడిన చెరువులకు మరమ్మతులు

గతేడాది వరదలకు ప్రధానంగా వర్షపాతం అధికంగా నమోదు కావడం ఓ కారణమైతే.. ఇదే తరుణంలో గణపురం మండలం ధర్మరావుపేట చెరువు, వెంకటాపూర్ మండలం బూర్గుపేట చెరువులకు గండిపడటంతో ఈ వరద ముంచెత్తింది. మరోవైపు ఇదే సమయంలో గణపసముద్రంలోకి 22 అడుగులకు ఉండాల్సిన నీటి మట్టం ఒక్కసారిగా 33 అడుగులకు పెరిగి ఉప్పొంగడంతో ఈ సమస్య తీవ్రతరమైంది. అయితే, గతంలో జరిగిన ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలో భాగంగా చెరువుల మరమ్మతు పనులను సైతం చేపట్టింది. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు నేతృత్వంలో ధర్మరావుపేట ఊర చెరువుకు రూ.1కోటి 70లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. వెంకటాపురం మండలం బూర్గుపేట చెరువుకు సైతం గండి పడకుండా పకడ్బందీ మరమ్మతులు చేశారు. అయినప్పటికి గ్రామస్థులను మాత్రం ఆ భయం వీడకపోవడం శోచనీయం.



అధిక వరద తాకిడికి తెగిపోయిన జాతీయ రహదారి (ఫైల్)

మంత్రి సీతక్క విస్తృత పర్యటన

ములుగు రూరల్ జూలై 22: ములుగు జిల్లాలో మంత్రి సీతక్క సోమవారం విస్తృతంగా పర్యటించారు. భారీ వర్షాలకు రాళ్లవాగు ప్రవాహానికి ములుగు మండలంలోని బండారుపల్లి, బుద్ధారం ప్రధాన రహదారి కొట్టుకుపోగా కలెక్టర్ దివాకరతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి గతంలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేశామని, ఎన్నికల కోడ్ రావడంతో పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని అన్నారు. త్వరలోనే పనులను పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టరును ఆదేశించారు. అనంతరం మేడివాగు వద్ద వరద ప్రవాహాన్ని పరిశీలించారు. మంత్రి వెంట అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ఆర్అండ్‌బీ డీఈ రఘువీర్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

డీఎంహెచ్‌వోకు సన్మానం

ములుగు కలెక్టరేట్: జిల్లాలోని మారుమూలన ఉన్న వాజేడు మండలంలోని పెనుగోలు గ్రామానికి ఇటీవల వాగులు, వంకలు, గుట్టలు దాటి గిరిజనులకు వైద్యసేవలు అందించిన డీఎంహెచ్‌వో ఉ అల్లెం అప్పయ్య, వైద్య బృందాన్ని మంత్రి ధనసరి సీతక్క ఘనంగా సన్మానించారు. ములుగులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె డీఎంహెచ్‌వోతోపాటు వాజేడు ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు మహేందర్, మధుకర్, హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్, ఎక్స్‌రే, ల్యాబ్ టెక్నీషియన్లు రజిని, ప్రసాద్, రమేష్‌ను సత్కరించారు.

జూనియర్ కాలేజీ తరగతి గదుల ప్రారంభం

వెంకటాపురం(నూగూరు): మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల తరగతి గదులను మంత్రి ధనసరి సీతక్క ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడి తెలుసుకున్నారు. తరగతులు నిర్వహించేందుకు బెంచీలు కావాలని విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో తగు చర్యలు తీసుకుంటామని అన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. అదేవిధంగా సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు, వైస్ ఎంపీపీ సయ్యద్‌హుస్సేన్, ఎంపీటీసీలు కొండపర్తి సీతాదేవి, ప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

మేడారం: జంపన్నవాగు పరీవాహక ముప్పు ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. మేడారం పర్యటనలో భాగంగా చింతల్ క్రాస్‌రోడ్డులోని లోలెవల్ వంతెన, చెక్‌డ్యాం, జంపన్నవాగు స్నానఘట్టాలు, జంటవంతెనల పరిసరాలను పరిశీలించారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలతో మాట్లాడారు. కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీశ్‌తో కలిసి పర్యటించిన మంత్రి.. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కొత్తూరు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన దొంతుల రాంరెడ్డి, మేడారంలోని మృతి చెందిన మల్లెల ముత్తయ్య కుటుంబాలను పరామర్శించారు.

గోదావరిని పరిశీలించిన మంత్రి

ఏటూరునాగారం రూరల్ : మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతిని మంత్రి సీతక్క పరిశీలించారు. గోదావరి నీటిమట్టం, తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గోదావరి వరదలపై అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని, పరిస్థితి ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ముంపు ప్రాంతాల ప్రజలకు గోదావరి పెరుగుదలపై సమాచారం అందిస్తూ ఉండాలన్నారు.



డీఎంహెచ్‌వో అప్పయ్యను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

గోదావరి ఉధృతి ఎక్కువైతే ముంపు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.

మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రిని మంత్రి తనిఖీ చేశారు.వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం తదితర మండలాల్లో ముందస్తు చర్యల్లో భాగంగా గర్భిణులను సామాజిక ఆస్పత్రికి తీసుకు రాగా వారి వద్దకు వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న భోజనం, వసతి, వైద్య సేవలపై ఆరా తీశారు. ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకు రావాలని సూచించారు. అనంతరం ఆస్పత్రిలోని పలు వార్డుల్లోకి వెళ్లి వైద్య సేవలు తీసుకుంటున్న రోగులను పరామర్శించారు. ఆమె కలెక్టర్ దివాకర, అడిషనల్ కలెక్టర్ పి.శ్రీజ, డీఎంహెచ్‌వో అప్పయ్య, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ తదితరులు ఉన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం

ఏటూరునాగారం మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలైన నాగులమ్మ వీధి, ఓడగూడెం, పద్మశాలి వీధి, కుమ్మరివాడ, బెస్తవాడ, ముతాలమ్మ వీధి, ఎర్రమ్మకాలనీ తదితర లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ దివాకర, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయతో కలిసి మంత్రి సీతక్క పరిశీలించారు. వరద ఉధృతి తగ్గేంత వరకు లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు.

చెరువులో పడి వృద్ధురాలి మృతి

కాటారం, జూలై 22: మండలంలోని గంగారం గ్రామానికి చెందిన సంతోషం మల్లమ్మ(75) కాటారం ఊర చెరువులో ప్రమాదవశాత్తూ పడి మృతి చెందింది. ఎస్సై సోమవారం వెల్లడిచిన వివరాల ప్రకారం.. మల్లమ్మకు కుమారులు లేరు. కూతుళ్లు ఉండగా వివాహం చేసింది. మనవడైన బాల్నె లక్ష్మణ్‌తో కలిసి గంగారంలో ఉంటోంది. ఈనెల 19న గంగారంలోని ఇంటి నుంచి కాటారంలో ఉన్న కూతురు భవాని ఇంటికి వెళ్లి ఆస్పత్రిలో చూపించుకుని మందులు తెచ్చుకుంటానని బయలుదేరి వెళ్లింది. మూడు రోజులుగా ఆమె ఆచూకీ లభించలేదు. సోమవారం కాటారం ఊర చెరువులో మృతదేహం కనిపించగా గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

మెగా రక్తదాన శిబిరం

కన్నాయిగూడెం, జూలై 22: మండంలోని ముప్పనపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో తలసేమియా బాధిత చిన్నారులు, గర్భిణుల కోసం సహాయనిధి సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎస్సై వెంకటేశ్, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి జాడి రాం బాబు ముఖ్య అతిథులుగా హాజరై రక్తదానం చేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ గిరి, మాజీ ఎంపీపీ సమ్మక్క, మాజీ సర్పంచ్ మౌనిక, సుమన్, రమేష్ పాల్గొన్నారు.

ఆదివాసీ జేఏసీ ధర్నా

మంగపేట, జూలై 22: ఆదివాసీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావుకు వినతిపత్రాన్ని అందజేశారు. మారుమూల గ్రామాల్లో వాగులు, ఒర్రెలపై బ్రిడ్జీలు నిర్మించి వాన కాలంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో పోడు భూములపై చర్చించి, ఫారెస్ట్ అధికారుల దాడులను నిలిపివేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలేబోయిన ఆదినారాయణ, తాటి నాగరాజు, తోలేం నర్సింగరావు, ఆక తిరుమల్‌రావ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కోటీశ్వరులు చేయటమే లక్ష్యం

5వ పేజీ తరువాయి

మాట్లాడారు. ఇప్పటికే జిల్లాలో వరద బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 171 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. గోదావరికి వరద పెరిగే ఆస్కారం ఉండటంతో ప్రజలను అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. వరదల్లో చిక్కుకున్న వారిని తరలిం చేందుకు రెస్క్యూ టీంలు అందుబాటులో ఉన్నాయన్నారు.

సీతక్కకు ఘన స్వాగతం

సీతక్కకు కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం వాజేడుకు తొలిసారి వచ్చిన ఆమెకు పూసూరు వంతెన వద్ద కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపుడి విక్రాంత్ వర్మ సత్కరించారు. సీతక్క వెంట కాంగ్రెస్ నాయకులు విశ్వనాథ ప్రసాదబాబురాజు, కల్యాణ్, జగన్నాథరాజు, వాసుబాబు, కాకర్లపుడి శ్రీనివాసరాజు, కాశీకృష్ణ, ఎంపీపీ శారద, జడ్పీటీసీ తల్లడి పుష్పలత, తల్లడి ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

పరవళ్లు తొక్కుతున్న గోదావరి

5వ పేజీ తరువాయి

మండలంలోని కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్‌వెల్, మంగపేట పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. సోమవారం సాయంత్రం వరకు సముద్ర మట్టానికి 8.5 అడుగులకు పైగా వరద ప్రవాహం ఉంది. దీంతో కమలాపురం, మంగపేట, బోరునర్సాపురం వద్ద ఇవతలి వైపు ఉన్న వ్యవసాయ భూములు మరింత కోతకు గురై గోదావరిలో కలిసిపోతున్నాయి. గోదావరి ఉప్పొంగడంతో కమలాపురం వద్ద ఎర్రవాగు, మంగపేట వద్ద గౌరారం వాగు పోటుకు గురికావడంతో బ్యాక్ వాటర్ లోతట్టు ప్రాంతాలకు చేరుకుంది. మల్లూరు, చుంచుపల్లి, పాలాయిగూడెం, వాడగూడెం, రాజుపేట, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి-వ ఎల్లారం, ఎస్టీకలనీలోని లోతట్టు ప్రాంతాలకు వరద నీరు చేరుతోంది. అలాగే మండలంలోని నర్సింహసాగర్ సమీపంలో ఉన్న మల్లూరు మధ్య తరహా ప్రాజెక్టులోకి క్రమేపీ వర్షపు నీరు చేరుతోంది. సోమవారం సాయంత్రం వరకు 113.7 మీటర్ల వరకు వరద చేరిందని ఇరిగేషన్ ఏఈ వలీ మహ్మద్ తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లోని 20 కుటుంబాలను నర్సింహసాగర్‌లోని ఐబీ భవనాల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించారు.

మామ అంత్యక్రియలకు వెళ్లి అల్లుడి మృతి



రాజశేఖర్ (ఫైల్)

మహదేవపూర్ రూరల్, జూలై 22 : మామ అంత్యక్రియలకు వెళ్లిన అల్లుడు ప్రమాదవశాత్తు మృతి చెందిన ఘటన భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో సోమవారం సాయంత్రం చోటుచేసు కుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబట్‌పల్లి గ్రామానికి చెందిన బింగి రాజశేఖర్(28) అదే గ్రామంలో నివసిస్తున్న తన మామ లాలయ్య మృతి చెందడంతో సోమవారం అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. అనంతరం ఎక్కనే ఉన్న వాగులు స్నానం చేసేందుకు వెళ్లిన రాజశేఖర్ కాలుజారి అందులో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు బయటకు తీశారు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని 108 వాహనం ద్వారా మహదేవపూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. ఒకే రోజు మామా అల్లుళ్ల మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం చోటుచేసుకుంది. మృతుడు రాజశేఖర్‌కు భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అంగన్‌వాడీల విలీనాన్ని వ్యతిరేకిస్తున్నాం

డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగారెడ్డి

భూపాలపల్లిటౌన్, జూలై 22: అంగన్‌వాడీ కేంద్రాలను పాఠశాలల్లో విలీనం చేయడాన్ని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో లింగారెడ్డి మాట్లాడారు. నూతన విద్యావిధానం 2020లో భాగంగానే అంగన్‌వాడీల విలీన ప్రక్రియ కొనసాగనుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ఈపీ -2020 పేరుతో నూతన సంస్కరణలు చేయడానికి ప్రయత్నిస్తుండగా, దానిని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసేందుకు ఉవ్విళ్లూరుతున్నాయని విమర్శించారు. విద్యారంగాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అలాగే ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన 5వ డీఏలను వెంటనే చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియలో నెలకొన్న అడ్డంకులను వెంటనే తొలగించి పారదర్శకంగా చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.తిరుపతి, వీరేశం, శ్రీనివాస్‌రెడ్డి, వీరన్న, అన్ని మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పీపీకి ఘన సన్మానం



పీపీని సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

ములుగు కలెక్టరేట్, జూలై 22: ములుగులోని జిల్లాకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా విధులు నిర్వర్తించి ఇటీవల బదిలీ అయిన పావనిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది. సోమవారం జిల్లాకోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి సూర్యచంద్రకళ, సీనియర్ సివిల్‌జడ్జి కన్నయ్య లాల్, జూనియర్ సివిల్‌జడ్జి రామ్మోహన్‌రెడ్డి, బార్ అసోసియేషన్ సభ్యులు పూలమాలలు, జ్ఞాపికలు, శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ముసరగాని వినయ్‌కుమార్, జిల్లాకోర్టు పీపీలు సత్యనారాయణ, రవికిరణ్, న్యాయవాదులు కె.సునీల్, శ్యామ్‌ప్రసాద్, స్వామిదాస్, వెంకటేశ్వర్‌రావు, వేణుగోపాలచారి, చంద్రయ్య, భిక్షపతి, కొండి రవీందర్, ప్రతాప్, రాజేందర్, విజయ్‌కుమార్, మన్సూర్, తదితరులు పాల్గొన్నారు.

జడ్పీహెచ్ఎస్‌లో చోరీ

కాటారం, జూలై 22: మండలకేంద్రంలోని కాటారం జడ్పీహెచ్ఎస్‌లో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం రాత్రి పాఠశాల కార్యాలయం, బీరువా తాళాలు పగుల గొట్టారు. బీరువాలోని కొన్ని పాఠశాల రికార్డులను మాయమైనట్లు తెలుస్తోంది. ఏవైనా సర్టిఫికెట్ల కోసం తాళం పగులగొట్టి చోరీకి పాల్ప డ్డారా..? అనే అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. సోమవారం హెచ్ఎం పాఠశాలకు సెలవు పెట్టగా ఇన్‌చార్జి హెచ్ఎం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

గోవిందరావుపేట, జూలై 22: మండలంలోని నేతాజీనగర్‌లో పేకాట స్థావరంపై పస్రా ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ తమకు అందిన సమాచారంతో నేతాజీనగర్‌లో పేకాట ఆడుతున్న స్థావరాన్ని గుర్తించి దాడి చేశామని అన్నారు. నలుగురిని అదుపులోకి తీసుకుని రూ.12,600 నగదు, రెండు ద్విచక్రవాహనాలు, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మరో ఆరుగురు పరారీలో ఉన్నారని, వారిని త్వరలోనే పట్టుకుంటామని పేర్కొన్నారు.

రౌడీషీటర్లు, పాత నేరస్థులకు కౌన్సెలింగ్

మండలంలోని రౌడీషీటర్లు, పాత నేరస్థులకు పస్రా పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై కమలాకర్ సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నేర ప్రవృత్తి వదిలేసి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. రౌడీషీట్, సస్పెక్ట్‌షీట్ కలిగిన వారిపై పోలీస్ నిఘా ఎప్పటికీ ఉంటుందని అన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి

చిట్యాల, జూలై 22: ఎన్నికల ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దొంగల రాజేందర్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ ఖాజా మోహియొద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ జనాభా ప్రతిపదికన రిజర్వేషన్లు పెంచాలని, గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని, రూ. 20వేల కోట్ల నిధులతో బీసీ సబ్‌ప్లాన్ నిధులు మంజూరు చేయాలని కోరారు. బీసీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారి సంక్షేమానికి నిధులు విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు కిరణ్‌కుమార్, శ్యామ్, మాదాసు మొగిలి, వల్లాల ప్రవీణ్, రాయిని శ్రీనివాస్, బుర్రి తిరుపతి, అనుమ మహేష్, మిట్ట కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి : పీఆర్టీయూటీఎస్

చిట్యాల, జూలై 22: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 50శాతం ఫిట్మెంట్‌తో పీఆర్సీ ప్రకటించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి బండి శ్రీనివాస్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రాంనారాయణ, గోవిందుల సత్యనారాయణ, శ్రీనివాస్, సుదం సాంబమూర్తి, లింగమూర్తి, కృష్ణ, రహీం, వాసంతి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



గాయపడిన అంజి

కాటారం, జూలై 22: మండలంలోని కిష్టంపేట సమీపంలో కాటారం-మంథని ప్రధాన రహదారిపై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాల య్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరాంపల్లికి చెందిన మారపాక అంజి బైక్‌పై మండల కేంద్రం నుంచి దేవరాంపల్లికి వెళ్తున్నాడు. అదే సమయంలో కిష్టంపేటకు పట్టెం మల్లేష్ తన ఇంటి నుంచి రోడ్డు పక్కన నడుచుకుంటూ ధన్వాడ వైపు వెళ్తున్నాడు. బైక్ వెనక నుంచి మల్లేష్‌ను ఢీకొనడంతో అతడు ఓ వైపు, అంజి మరో వైపు ఎగిరిరోడ్డుపై పడ్డారు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అంజి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌కు తరలించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు.

ఘనంగా దాశరథి జయంతి

కాటారం, జూలై 22: ప్రముఖ సాహితీవేత్త దాశరథి కృష్ణమాచార్యులు 99వ జయంతి వేడుకలు మండలంలో సోమవారం ఘనంగా జరిగాయి. ధన్వాడ జడ్పీహెచ్ఎస్‌లో ఉపాధ్యాయులు, మండల కేంద్రంలో జయశంకర్ సార స్వత సమితీ ఆధ్వర్యంలో దాశరథి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సారస్వత సమితి వ్యవస్థాపకులు గడ్డం లక్ష్మయ్య, సభ్యులు సురేష్, శ్రీనివాసాచారి, నాగేశ్వర్, సత్యనారాయణ, శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేటీపీపీని సందర్శించిన థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య

గణపురం, జూలై 22: మండలంలోని చెల్పూరు కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టును థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య సోమవారం సందర్శించారు. మొదటి దశ జెన్‌కో ఆదేశాల మేరకు ఓవరాలింగ్ జరుగుతున్న నేపథ్యంలో పనులను పరిశీలించారు. బాయిలర్ ట్యూబ్‌లు, విడి పరికరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆగస్టు మొదటి వారంలో మొదటి దశ 500 మెగావాట్లలో విద్యుత్ ప్రారంభించాలని తెలిపారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

వెంకటాపురం(నూగూరు), జూలై 22: పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వీరభద్రవరం గ్రామంలో సోమవారం జరిగింది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని మునిగెల శ్రీనివాస్(55) మద్యానికి బానిసై రోజూ కుటుంబసభ్యులతో గొడవ పడుతుండేవాడు. మద్యం సేవించవద్దని కుటుంబ సభ్యులు శ్రీనివాస్‌ను మందలించడంతో సోమవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించేలోపే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తిరుపతిరావు తెలిపారు.

వరదలో చిక్కుకుని దుక్కిటెద్దు మృతి

తాడ్వాయి, జూలై 22: వాగు వరదలో చిక్కుకుని దుక్కిటెద్దు మృతిచెందిన సంఘటన మండలంలోని దామెరవాయి గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. దామెరవాయి గ్రామానికి చెందిన కురుసం ఎల్లయ్య ఆదివారం తన వ్యవసాయ భూమిలో దుక్కితున్నిన అనంతరం సాయంత్రవేళ ఎడ్లను మేతకోసం వదిలిపెట్టాడు. ఈక్రమంలో గత ఐదురోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు సింగారం వాగు ఉప్పొంగింది. ఎద్దు వాగుదాటే క్రమంలో వరద ఉధృతంగా ప్రవహించడంతో ఆధాటికి ఓ ఎద్దు వాగులో కొట్టుకుపోయి మృతిచెందింది. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో రూ.50వేల విలువచేసే ఎద్దు మృతిచెందడంతో బాధిత రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. ప్రభుత్వం బాధిత రైతుకు ఆర్థికసాయం అందజేసి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళా సంఘాలపై విచారణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొగుళ్లపల్లి, జూలై 22: మండలంలోని మహిళా సంఘాల్లో జరుగుతున్న అక్రమాలపై జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం మండల అధికారులు విచారణ చేపట్టారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో మహిళా సంఘాల్లో ఇష్టారాజ్యం అనే శీర్షికన కథనం ప్రచురితం కావడంతో మండల సమాఖ్య భవనంలో ఏపీఎం రవివర్మ, సీబీవో తిరుపతిలు వీవోఏలు, ఒక వీవోకు సంబంధించిన గ్రూపు సభ్యులను రప్పించి విచారణ చేపట్టారు. నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏపీఎం రవివర్మ తెలిపారు. రెండురోజుల్లో సంబంధిత జిల్లా అధికారుల విచారణ కూడా ఉంటుందని, మండలవ్యాప్తంగా స్పెషల్ ఆడిట్ చేయిస్తామని వారు పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కిష్టయ్య



రేగొండ, జూలై 22: భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రేగొండ మండలంలోని రేపాక గ్రామానికి చెందిన గుంటోజు కిష్టయ్యను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పేర్కొన్నారు. కిష్టయ్య 1995 నుంచి 2002 వరకు రేపాక సర్పంచ్‌గా పని చేశారు. 2004 నుంచి 2013 వరకు పీఏసీఎస్ చైర్మన్‌గా కొనసాగారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియ మించిన ఎమ్మెల్యే సత్యనారాయణరావుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ

భూపాలపల్లిటౌన్, జూలై 22: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివస్ కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే పాల్గొన్నారు. 16 ఫిర్యాదులు రాగా వాటిని ఆయన పరిశీలించారు. వాటిపై సత్వరంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని ఆయా పోలీస్‌స్టేషన్ల సీఐ, ఎస్సైల ను ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధులు నిర్వర్తిస్తూనే అసంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం

కాటారం, జూలై 22: మండలంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 59.2మి.మీ వర్షపాతం నమోదు కావడంతో గోపాల్‌పూర్‌వాగు, అలుగువాగు, బొర్రవాగు, పెద్దవాగులు ఉప్పొంగి ప్రవహించాయి. రేగులగూడెం జీపీ పరిధిలోని గోపాల్‌పూర్ వాగు ఉప్పొంగడంతో పంట పొలాలన్నీ వరదనీటిలో మునిగాయి. పొలాలు చెరువును తలపిస్తున్నాయి. వాగు గట్టుపై నుంచి ఎత్తిపోయ డంతో వరద ఉధృతికి పలువురు రైతులకు చెందిన పొలాలకు గండ్లు పడి ఇసుక మేటలు వేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు. భారీ వర్షానికి గోపాల్‌పూర్‌లో సమ్మక్క ఇంటి గోడ కుప్పకూలింది. పలు గ్రామాల్లో పలు ఇళ్ల గోడలు వర్షాలకు నాని కూలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఊర చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే సత్యనారాయణ

గణపురం : మండలంలోని ధర్మరావుపేట శివారులో ఉన్న ఊర చెరువును కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సందర్శించారు. గత సంవత్సరం కురిసిన భారీ వర్షాలకు ఊర చెరువు తెగిపోగా మరమ్మతులు చేయించారు. అవి పూర్తయిన సందర్భంగా చెరువు ఆయకట్టును పరిశీలించారు. ఇటీవల కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ఆయకట్టు పరిస్థితులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ నరేష్, ఎంపీడీవో భాస్కర్, ఇరిగేషన్ అధికారులు తదితరులు ఉన్నారు.

అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధం : కలెక్టర్

భూపాలపల్లి కలెక్టరేట్: అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కలెక్టరేట్‌లో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి వర్షాల ప్రభావంపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలో అధికంగా వర్షపాతం ఉన్న నేపథ్యంలో ముందుస్తుగా చర్యలు చేపట్టామన్నారు. కాళేశ్వరం వద్ద గోదావరి మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తోంద న్నారు. మే డిగడ్డ, అన్నారం ప్రాజెక్టుల్లో అన్ని గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నట్లు తెలిపారు. చెరువుల వద్ద నిరంతరం పటిష్ఠ నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు. చెరువుల నీటి మట్టం, కట్ట పరిస్థితులను ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. వరదల ధాటికి కొట్టుకుపోయిన రోడ్లు, కల్వర్టులకు యుద్ధ ప్రతిపాదికన మరమ్మతులు చేయాలన్నారు. ప్రజలు రోగాల బారినపడకుండా చర్యలు చేపట్టాలన్నారు.

పునరావాస కేంద్రాల ఏర్పాటు

ఏటూరునాగారం :గోదావరి, వాగుల వరద మండల కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలైన ఎస్సీ కాలనీ, నాగులమ్మ వీధి, ఓడగూడెం, పద్మశాలి వీధి, కుమ్మరివాడ, బెస్తవాడ, ఆచార్య నగర్, అంబేద్కర్ నగర్, ముతాలమ్మ వీధి తదితర కాలనీల్లోకి చేరాయి. ఇళ్లల్లోకి నీరు రావడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. మంత్రి సీతక్క దీనిపై స్పందిస్తూ లోతట్టు ప్రాంతాల ప్రజలకు వెంటనే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ దివాకర, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రాకు సూచించారు. దీంతో మండల కేంద్రంలోని క్రాస్ రోడ్డులోని యూత్ ట్రైనింగ్ సెంటర్, గిరిజన భవన్, పోస్ట్ మెట్రిక్ (బాలికల) హాస్టల్, వైటీసీ, రైతు వేదిక, టీడబ్ల్యూఆర్ఎస్ఎస్ పాఠశాల, స్పోర్ట్స్ బాయ్స్ పాఠశాల, ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల, సీఎంహెచ్ తదితర ప్రదేశాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ జగదీశ్వర్, ఎంపీడీవో కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి వీటిని పర్యవేక్షిస్తున్నారు.

రాకపోకలు బంద్

వాజేడు: గోదావరి వరద ఉధృతి పెరగటంతో మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ రహదారి టేకులగూడెం వద్ద రేగుమాగు గండి వరద నీరు జాతీయ రహదారిపై రావటంతో అంతర్రాష్ట్ర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అదే విధంగా మండ లంలోని పేరూరు-చంద్రుపట్ల, కోయ వీరాపురం, వాజేడు-గుమ్మడిదొడ్డి, ఏడ్జర్లపల్లి-బొమ్మ నపల్లి గ్రామాల మధ్య ఉన్న వాగులకు వరద ఉధృతి ఉండటంతో ఆ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా కృష్ణాపురం వద్ద ఉన్న వంతెన సమీపంకు వరద నీరు రావటంతో ఆ గ్రామానికి కూడా రాకపోకలు బంద్ అయ్యే అవకాశం ఉంది. ఇది ఇలా ఉండగా గుమ్మడిదొడ్డిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో బాధితులు బస చేస్తున్నారు. లోతట్టులో ఉన్న ప్రాంతాలను తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ రాహుల్‌చంద్ర వర్మ, ఎంపీవో శ్రీకాంత్ నాయుడు, ఆర్ఐ కుమారస్వామి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.



ధర్మరావుపేట చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు

మల్హర్: ఎగువన కురిసిన వర్షాల వల్ల తాడిచర్ల, పీవీనగర్ వద్ద మానేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాడిచర్ల వద్ద మానేరు ప్రవాహం రెండు మీటర్ల ఎత్తులో సాగుతోంది.

ఓసీపీల్లో ప్రారంభంకాని బొగ్గు ఉత్పత్తి

కాకతీయఖని/మల్హర్ : సింగరేణి భూపాలపల్లి ఏరియాలో గత మూడు రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. సోమవారం వర్షం పడనప్పటికీ బొగ్గు ఉత్పత్తిని ప్రారంభించలేదు. వర్ష ప్రభావంతో డంప్ యార్డ్, హాల్‌రోడ్స్ బురదమయం కావడంతో వాహనాలు నడవలేని పరిస్థితి నెలకొందని. దీంతో బొగ్గు ఉత్పత్తి పనులు చేపట్టడం సాధ్యపడలేదని సింగరేణి అధికారులు తెలిపారు. ఓసీ-3, ఓసీ-2 ప్రాజెక్ట్ ద్వారా గడిచిన నాలుగు రోజుల్లో సుమారు 25,500 టన్నుల బొగ్గు ఉత్పత్తిని చేపట్టాల్సి ఉండగా సాధ్య పడలేదన్నారు. దీంతో సింగరేణి సంస్థకు సుమారు రూ.9కోట్లు నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. అలాగే తాడిచర్ల ఓసీపీలో వర్షం కారణంగా నాలుగో రోజు కూడా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. 1.30 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి, 6 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడినట్లు మైన్ అధికారులు తెలిపారు. నాలుగు రోజుల్లో 24 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోవడంతో రూ. 4 కోట్ల నష్టం వాటిల్లింది.